సాక్షి
వైఎస్సార్ జిల్లా
సోమవారం । 27 । జనవరి । 2025



ఆధిక్యంలో ఆంధ్రా జట్టు
కడపలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న అండర్–23 క్రికెట్ మ్యాచ్‌లో ఆంధ్రా జట్టు 177 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. -8లో



ఆగి ఉన్న లారీని ఢీకొన్న బొలెరో
ఆగి ఉన్న లారీని బొలెరో వాహనం ఢీకొని ఇద్దరు దుర్మరణం చెందారు. ఈ సంఘటన శనివారం రాత్రి జి.కొత్తకోట మండలం కోటి రెడ్డిగారిపల్లి వద్ద జరిగింది. -8లో

గరిష్టం/కనిష్టం
32.4/14.8
వాతావరణం
జిల్లాలో ఆదివారం 14.8 – 32.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

ప్రాధాన్యత క్రమంలో ప్రాజెక్టుల పూర్తి


పోలీసు పరేడ్ మైదానంలో జాతీయ పతాకానికి వందనం చేస్తున్న కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ అశోక్‌కుమార్


పోలీసు పరేడ్‌ను తిలకిస్తున్న కలెక్టర్ శ్రీధర్


ఉత్తమ ప్రదర్శన ఇచ్చిన ఎన్‌సీసీ విద్యార్థులతో కలెక్టర్, ఎస్పీ, జేసీలు


విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

- రూ. 25,050 కోట్ల పెట్టుబడితో పరిశ్రమలు
- చురుగ్గా గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే పనులు
- జీరో పేదరిక సాధనే లక్ష్యం
- గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టు పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. ఆదివారం పోలీసు పెరేడ్ మైదానంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆయన తొలుత జాతీయ జెండాను ఎగురవేసి పరేడ్‌ను తిలకించారు. పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం జిల్లా ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ గత ఖరీఫ్‌లో పెన్నా బేసిన్‌లో వర్షాభావం ఏర్పడినప్పటికీ కృష్ణా మిగులు జలాల ద్వారా 82,193 ఎకరాల ఆయకట్టుకు నీరందించామన్నారు. పెండింగ్‌లో ఉన్న జీఎన్ఎస్ఎస్ ఫేస్–2లోని ప్యాకేజీ–1, 2 పనులు, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కుడికాలువ, రాయలసీమ డ్రౌట్ మిటిగేషన్ సాగునీటి ప్రాజెక్టు పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తామన్నారు. ఈ–క్రాపింగ్ నమోదులో జిల్లా మొదటిస్థానంలో ఉందన్నారు. 2024–25 రబీ సీజన్‌లో ఫసల్‌బీమా యోజన కింద బీమా నమోదు చేయించడంలో రాష్ట్రంలోనే జిల్లా అగ్రస్థానంలో నిలిచిందన్నారు. పంట రుణాల మంజూరులో 132 శాతం ప్రగతిని సాధించామని పేర్కొన్నారు. ఉద్యానశాఖ కింద ఈ యేడు 18.63 కోట్ల రూపాయలతో వివిధ పథకాలు అమలు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఉద్యాన సమగ్ర అభివృద్ధి పథకం కింద 2349.24 హెక్టార్ల అభివృద్ధికి రూ. 2.47 కోట్లతో రైతులకు చేయూతనిస్తామన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 17.6 మెట్రిక్ టన్నుల ఏ–గ్రేడ్ వరిధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. జిల్లాలో 11 గోదాముల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. ఉపాధి హామీ పథకం కింద 90 శాతం సబ్సిడీతో 875 మినీ గోకులాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మహిళా సాధికారతలో భాగంగా స్వయం సహాయక సంఘాలకు రుణాలు పంపిణీ చేస్తున్నామని, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ సవ్యంగా జరుగుతోందని తెలిపారు. ఈనెల 4వ తేది నుంచి జిల్లాలోని 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని 5073 మంది విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని అందిస్తున్నామని చెప్పారు.

11 భారీ పరిశ్రమలు
జిల్లాలో 25050 కోట్ల రూపాయల పెట్టుబడితో 11 భారీ పరిశ్రమల ద్వారా 15080 మందికి ఉపాధి కల్పించే పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. జూన్ నుంచి ఇప్పటివరకు 74 పరిశ్రమలకు రూ. 10.99 కోట్లు పారిశ్రామిక రాయితీ నిధులు మంజూరు చేశాన్నారు. కొప్పర్తి (నార్త్)లో 3155 ఎకరాల్లో 738 కోట్ల రూపాయలతో మెగా ఇండస్ట్రియల్ హబ్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వాన్ని కోరామన్నారు. కొప్పర్తి సౌత్‌లో 2596 ఎకరాల్లో వైజాగ్–చెన్నై ఇండస్ట్రియల్ క్యారిడార్‌ను అభివృద్ధికి చేసేందుకు ప్రతిపాదించామన్నారు.

జాతీయ రహదారులు
బెంగళూరు–కడప–విజయవాడ ఎకనమిక్ కారిడార్‌లో భాగంగా ఎన్‌హెచ్–544జీ ప్రాజెక్టు ద్వారా 343.24 కిలోమీటర్ల మేర చేపట్టిన గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం 1020 హెక్టార్ల భూమి సేకరించామని తెలిపారు. పంచాయతీరాజ్ విభాగంలో రూ. 84.87 కోట్లతో ఉపాధి హామీ కింద మౌలిక వసతుల కల్పన కోసం 1071 పనులు చేపట్టామన్నారు. దీపం పథకం కింద ఇప్పటివరకు 3,28,596 కుటుంబాలకు 3,32,429 సిలిండర్లు పంపిణీ చేసి రూ. 25.82 కోట్లు సబ్సిడీ కింద లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశామన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా జూన్ 15 నుంచి ఇప్పటివరకు 10,495 ఫిర్యాదులు రాగా, అందులో 7914 ఫిర్యాదులు పరిష్కరించామని, మిగతావి పరిష్కార దశలో ఉన్నాయని తెలిపారు.


భరత మాత వేషధారణలో విద్యార్థిని

జీడీపీ వృద్ధిరేటు పెంపు
జిల్లా స్థూల దేశీయోత్పత్తి 2022–23 ప్రకారం 51,715 కోట్ల రూపాయలు ఉందన్నారు. దీన్ని 2029 నాటికి 1,16,408 కోట్ల రూపాయలకు చేరుకునేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. జీరో పేదరికం సాధన కోసం స్వర్ణాంధ్ర విజన్‌లో పెద్దపీట వేశామన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు
కడప మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూలు విద్యార్థుల చెక్ దే ఇండియా, హ్యాపీకిడ్స్ విద్యార్థుల ఇది మన దేశమురా, కడప ట్రైబల్‌వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల విద్యార్థుల బంజారా నృత్యం, మైదుకూరు మండలం శెట్టివారిపల్లె జెడ్పీ పాఠశాల విద్యార్థులు ఐ లవ్ ఇండియా, కడప విస్‌డమ్ పాఠశాల విద్యార్థుల గుర్రపుస్వారీ విన్యాసం అలరించాయి. అనంతరం విధి నిర్వహణలో విశేష సేవలు అందించిన వివిధ శాఖలకు చెందిన 380 మంది కలెక్టర్ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్, జేసీ అదితిసింగ్‌తోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వివిధ శాఖల స్టాల్స్ ఏర్పాటు
ఈ సందర్భంగా వ్యవసాయ, డీఆర్‌డీఏ, మెప్మా, డ్వామా, ఐసీడీఎస్, ఉద్యాన, మున్సిపల్, పశుసంవర్ధకం, ఆప్కో చేనేత జౌళి, పట్టు పరిశ్రమ. నాబార్డు, వైద్య ఆరోగ్యం, వికలాంగుల సంక్షేమం, పోలీసుశాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను కలెక్టర్ సందర్శించారు.

రూ.1031.12 కోట్ల ఆస్తుల పంపిణీ

గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా 10712 యూనిట్లకు సంబంధించి 95494 మంది లబ్ధిదారులకు రూ.1031.12 కోట్ల ఆస్తులను జిల్లా కలెక్టరు శ్రీధర్ చెరుకూరి, జేసీ అదితి సింగ్ సంబంధిత అధికారులతో కలిసి పంపిణీ చేశారు. డీఆర్డీఏ ద్వారా బ్యాంకు లింకేజీ క్రింద 48730 మందికి రూ 419.19 కోట్లు. స్త్రీ నిధి క్రింద 11326 మందికి రూ. 73.26 కోట్లు, మెప్మా ద్వారా బ్యాంకు లింకేజీ కింద 35410 మందికి రూ 537.87 కోట్లు, విభిన్న ప్రతిభావంతుల సంస్థ ద్వారా నేషనల్ హ్యాండీక్యాంప్డ్ ఫైనాన్స్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ క్రింద 5 మందికి రూ 0.25 కోట్లు, లాప్టాప్ల పథకం కింద 11మందికి రూ 0.33కోట్లు, బ్యాటరీ ఆపరేటర్ ట్రై సైకిల్స్ పథకం కింద నలుగురికి రూ 0.18కోట్లు, చెవిటి మిషన్ల పథకం కింద ఎనిమిది మంది లబ్ధిదారులకు రూ 0.04 కోట్లు పంపిణీ చేశారు.


అగ్నిమాపకశాఖ సిబ్బంది విన్యాసం

న్యూస్‌రీల్

డీటీసీ చంద్రశేఖర్ రెడ్డి సస్పెన్షన్

కడప వైఎస్ఆర్ సర్కిల్: మహిళా ఉద్యోగిపై లైగింక వేధింపులకు పాల్పడిన జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్(డీటీసీ) చంద్రశేఖర్ రెడ్డిని సస్పెండ్ చేశారు. ఈమేరకు రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే రవాణా శాఖ ప్రధాన కార్యాలయంలో డీటీసీ చంద్రశేఖర్ రెడ్డి రిపోర్టు చేసుకున్నారు. విచారణ జరిపిన ఉన్నతాధికారులు లైంగిక వేధించినట్లు రుజువు కావడంతో ఆయనను సస్పెండ్ చేశారు.

బైబిల్ క్విజ్‌లో ప్రతిభ

కడప కల్చరల్: శాంతి సేవా సొసైటీ సభ్యులు మడగలం స్రవంతి బైబిల్ క్విజ్ పోటీల్లో ప్రతిభ చాటారు. ఆదివారం ఆరోగ్యమాత పుణ్యక్షేత్రంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో శాంతి సేవా సొసైటీ కార్యదర్శులు మద్దూరి మోహన్, మునెయ్య ఈ విషయాన్ని విలేకరులకు తెలిపారు. పాస్టరల్ సెంటర్ డైరెక్టర్ వరప్రసాద్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారని తెలిపారు. స్రవంతికి నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందజేశారన్నారు. కార్యక్రమంలో మడగలం ప్రసాద్, కథోలిక ల్యాండ్ ఇన్‌ఛార్జి రెవరెండ్ ఫాదర్ బాకీ రవీంద్ర, సొదుం విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ ప్రకాశ్, ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం డైరెక్టర్ ఫాదర్ ఎండీ ప్రసాద్‌రావు, సహాయ డైరెక్టర్ పిల్లి మహేష్, పాల్గొన్నారు.

ఘనంగా 'అట్ హోమ్'


అట్‌హోమ్‌లో కలెక్టర్, ఎస్పీ, ప్రజాప్రతినిధులు

కడప సెవెన్‌రోడ్స్: 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని స్థానిక జిల్లా కలెక్టర్ బంగ్లా ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం అత్యంత ఆహ్లాదకరమైన వాతావరణంలో 'అట్ హోమ్' కార్యక్రమం జరిగింది. కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఏర్పాటు చేసిన ఈ తేనీటి విందులో జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్, జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, డీఆర్వో విశ్వేశ్వర నాయుడు,కడప నగర పాలక కమిషనర్ మనోజ్ కుమార్ రెడ్డి, కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, జమ్మలమడుగు ఆర్డీఓ సాయి శ్రీ, ఎమ్మెల్యేలు వరదరాజుల రెడ్డి, పుట్టా సుధాకర్ యాదవ్, ఆదినారాయణ రెడ్డి, పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి పాల్గొనగా.. వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. అట్ హోమ్ కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారి సురేష్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంప్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాచీన కళలైన జానపదాలు, భరతనాట్యాలు, జాతీయ భక్తి గీతాలు అట్ హోం కార్యక్రమంలో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు.

భక్తుల సంఖ్య పెంచేలా చర్యలు

ఒంటిమిట్ట రామాలయానికి విచ్చేసిన నిపుణుల బృందం


రామతీర్థాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేక నిపుణుల బృందం

ఒంటిమిట్ట: ఒంటిమిట్టలో భక్తుల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకుంటామని ప్రత్యేక నిపుణుల బృందం సభ్యులు పేర్కొన్నారు. ఇందుకోసం ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ముగ్గురు సభ్యులతో కూడిన బృందం ఒంటిమిట్టకు విచ్చేసింది. రామాలయం వద్ద ఉన్న అధికారిక భవనంలో బృందంలోని సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాలంటే ఏం చేయాలనే దానిపై సంబంధిత టీటీడీ అధికారులతో వారు చర్చించారు. ఒంటిమిట్ట చెరువును ట్యాంకు బండగా తీర్చిదిద్దాలని, భక్తులు స్వామివారిని దర్శించుకునే విధానాన్ని ఆగమశాస్త్రం ప్రకారం తీసుకురావాలని, త్రేతాయుగంలో ఏర్పడిన రామతీర్థానికి పూర్వ వైభవం తీసుకురావాలని, ఒంటిమిట్ట చెరువు కట్టపై ఉన్న ఖాళీ జాగాలో అభివృద్ధి పనులు చేయాలని నిర్ణయించారు. అలాగే భక్తులు అన్న ప్రసాదానికి ఇబ్బంది పడకుండా శాశ్వత అన్న ప్రసాద కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, ఒంటిమిట్ట రామాలయం నుండి కల్యాణ వేదిక వరకు రోడ్లను విస్తరించాలని, ఎస్సీ బాలుర హాస్టల్ సమీపంలో ఖాళీగా ఉన్న 7.5 ఎకరాల కోదండరామస్వామి మాన్యాన్ని అభివృద్ధికి ఉపయోగించాలని నిర్ణయించారు. అలాగే ఒంటిమిట్టలో ఉన్న తొమ్మిది పురాతన మండపాలను పునరుద్ధరించాలని, పురాతన ఆచారాల ప్రకారం ఒంటిమిట్టలో ఏయే కైంకర్యాలు జరిగేవో వాటిని మళ్లీ తీసుకురావాలని యోచిస్తున్నారు. దీనికి సంబంధించి నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని వారు వివరించారు.

- 2018లో ఈదురు గాలులు విపరీతంగా వీచి కల్యాణ వేదిక వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక షెడ్లు పడిపోయి ప్రాణ నష్టం జరగడంతో అప్పటి ప్రభుత్వం శాశ్వత కల్యాణ వేదికను నిర్మించాలని ఆదేశించింది. దీంతో శాశ్వత కల్యాణ వేదిక ఏర్పాటు చేశారు. ఆదివారం అదనపు అభివృద్ధి పనులను పరిశీలించేందుకు వచ్చిన నిపుణులు బృందంలోని సభ్యులు శాశ్వత కల్యాణ వేదికను చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎలివేషన్ కోసం నాసిరకపు రేకులతో షెడ్లు వేశారని విమర్శించారు.

పరీక్షకు వేళాయె

- నేటి నుంచి ఫార్మేటివ్ –3 పరీక్షలు ప్రారంభం
- పరీక్ష రాయనున్న 1,41,012 మంది విద్యార్థులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు: **2052**
అందులో చదువుతున్న బాలురు: **65,821**
బాలికలు: **75,181**


పరీక్షలు రాస్తున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల్లో దాగి ఉన్న విద్యాసామర్థ్యాన్ని పరిశీలించేందుకు ఏటా నాలుగు సెల్ఫ్ అసెస్‌మెంట్, రెండు సమ్మెటివ్ అసెస్‌మెంట్ పరీక్షలను నిర్వహి స్తుంటారు. అందులో భాగంగా మూడవ సెల్ఫ్అసెస్‌మెంట్ పరీక్షలు జిల్లావ్యాప్తంగా సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఇందుకోసం విద్యా శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లాలోని అన్ని ప్రైవేటు, ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో 1 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు రాష్ట్ర విద్యా పరిశోధన మండలి(ఎస్‌సీఈఆర్టీ) రూపొందించిన పరీక్ష పత్రం ద్వారా ఈ పరీక్షలను రాయనున్నారు.

పరీక్షల వివరాలు..
- 1 నుంచి 5వ తరగతి చదివే విద్యార్థులకు ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, మళ్లీ మధ్యాహ్నం 1.10 నుంచి 2.10 వరకు పరీక్షలు జరుగుతాయి
- 6 నుంచి 8వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 1.10 గంటల నుంచి 2.10 గంటల వరకు, మళ్లీ 2.20 గంటల నుంచి 3.20 వరకు పరీక్షలు జరుగుతాయి.
- 9 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు, మళ్లీ 11.15 నుంచి 12.15 గంటల వరకు మరో పరీక్షను నిర్వహించనున్నారు. ఈ పరీక్షల నిర్వహణకు సంబంధించి ఎస్‌సీఈఆర్టీ ముంద్రించిన ప్రశ్నాపత్రాలను కడప డీసీఈబీకి చేరుకున్నాయి. అక్కడి నుంచి మండల కేంద్రాల్లోని మండల వనరుల కేంద్రానికి కూడా చేరిపోయాయి. ఆయా పరీక్షల రోజు గంట ముందు మాత్రమే హెచ్ఎంలకు ప్రశ్నపత్రాలను ఇవ్వనున్నారు. ఈ పరీక్షలు ఓఎంఆర్ షీట్ విధానంలో జరుగుతాయి.

ఏరాట్లు పూర్తి



జిల్లావ్యాప్తంగా 27వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఎఫ్ఏ–3 పరీక్షలకు సంబంధించి ఎస్‌సీఈఆర్‌టి ద్వారా సరఫరా అయిన ప్రశ్నపత్రాలను మండల కేంద్రాలకు తరలించాం. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశాం. – విజయభాస్కర్‌రెడ్డి, సెక్రటరీ, డీసీఈబీ, వైఎస్సార్‌జిల్లా

పకడ్బందీగా నిర్వహించాలి



ప్రభుత్వ పాఠశాలల్లో నేటి నుంచి నిర్వహించే ఎస్ఏ– 3 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి. ప్రతి పేపరుపై జిల్లా కోడ్ ఉంటుంది. ఏ పాఠశాల నుంచి అయినా పేపర్ లీక్ అయితే క్యూఆర్ కోడ్ ద్వారా తెలుసుకునే వీలుంది. కాబట్టి జాగ్రత్తగా పరీక్షలను నిర్వహించాలి.
– డాక్టర్ షేక్. షంషుద్దీన్, జిల్లా విద్యాశాఖాధికారి

బ్రహ్మోత్సవ వైభవం!

- 28 నుంచి కడప రాయుని బ్రహ్మోత్సవాలు
- చురుగ్గా కొనసాగుతున్న ఏర్పాట్లు

కడప కల్చరల్: తిరుమల తొలిగడపగా భావించే దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 28వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్నాయి. ఆలయ గోపురం ఎదుట ఉత్సవాల వివరాలను క్లుప్తంగా తెలుపుతూ ఫ్లెక్సీ ఆర్చిని ఏర్పాటు చేశారు. ఆలయ గోపురానికి రంగులు వేస్తున్నారు. ఆలయం లోపల కూడా పలుచోట్ల రంగులతో ముగ్గులు వేస్తున్నారు. ఇప్పటికే ఆలయ ప్రాంగణంలో, వెలుపల ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయం లోనూ, ఆలయ గోపురం, ప్రహారీలకు విద్యుద్దీపాలతో సీరియల్ సెట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఆలయంలో అడుగు పెట్టగానే బ్రహ్మోత్సవాల శోభ కనిపించేలా ఆ ప్రాంగణాన్ని తీర్చిదిద్దుతున్నారు. రోజువారి సేవల కోసం వాహనాలకు మరమ్మతులు చేశారు. కడప నగరం నలుమూలల బ్రహ్మోత్సవాల వివరాలతో భారీ హోర్డింగ్‌లను ఏర్పాటు చేశారు. రథోత్సవం కోసం రథానికి మరమ్మతులు చేపట్టి ఆకర్షణీయంగా రంగులతో సిద్ధం చేస్తున్నారు.


ఆలయ ప్రాంగణంలో చలువ పందిరి

ప్రత్యేక శ్రద్ధతో.....
తిరుమల తిరుపతి దేవస్థానాలకు చెందిన ఇద్దరు ఉన్నతాధికారులు కడప రాయిని బ్రహోత్సవాలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. వారిలో ఒకరు కడప వారు కాగా మరొకరు కడపలో ఉద్యోగం చేశారు. జిల్లాలో దేవునికడప బ్రహ్మోత్సవాలకు గొప్ప పేరుంది. వారం రోజులపాటు వాహన సేవలకు భక్తులు పెద్ద ఎత్తున హాజరవుతారు. రథోత్సవం నాడు భారీగా తిరునాల జరుగుతుంది. రాయలసీమ నలుమూలల నుంచి భక్తులు భారీగా హాజరవుతారు. కడపలోని కృష్ణా సర్కిల్ నుంచి దేవునికడప వరకు, పాతకడప నుంచి ఆలయం వరకు రోడ్లు జనంతో నిండిపోతాయి. నిర్వాహకులు రెట్టించిన ఉత్సాహంతో బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని అన్ని ఏర్పాట్లు చేస్తు న్నారు. టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం నెలరోజుల క్రితమే ఆలయాన్ని దర్శించుకున్నారు. బ్రహ్మోత్స వాల ఏర్పాట్ల గురించి అర్చకులు, స్థానిక అధికారులతో చర్చించారు. పుష్కరిణిని ఆధునికీకరించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించగా, అందుకు అనుగుణంగా పనులు కొనసాగుతున్నాయి. మాడవీధుల్లో సిమెంటురోడ్డు అవసరాన్ని స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. రథం తిరిగేందుకు అనుకూలంగా మార్చాలని కోరారు. మొత్తంపై ఈసంవత్సరం ఉత్సవాలను అర్చకులు, అధికారులు ప్రతిష్ఠగా తీసుకొని ప్రత్యేక శ్రద్ధతో ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎన్‌హెచ్ అధికారుల అత్యుత్సాహం


మూల వంక–బుగ్గలేటిపల్లె మధ్యన ఉన్న పాత జాతీయ రహదారి బ్రిడ్జివద్ద సిమెంటు ఇటుకలతో కట్టిన గోడ

చింతకొమ్మదిన్నె: కడప–చిత్తూరు జాతీయ రహదారిపై మూల వంక నుంచి బుగ్గలేటిపల్లె మధ్య ఉన్న పాత జాతీయ రహదారి బ్రిడ్జికి ఇరువైపులా గణతంత్ర దినోత్సవ రోజున రాత్రి 7 నుంచి 8 గంటల మధ్య సమయంలో సిమెంటు ఇటుకలతో జాతీయ రహదారుల ఈఈ విజయభాస్కరరెడ్డి నేతృత్వంలో గోడ కట్టారు. ఈ బ్రిడ్జి పై నుంచి ప్రతిరోజు సమీప ఏఎల్ కాలనీ వాసులు ప్రయాణిస్తుంటారు. ఈ విషయమై ఈఈ విజయభాస్కరరెడ్డిని వివరణ అడుగగా బ్రిడ్జి సామర్థ్యాన్ని పది రోజుల క్రితం నిపుణుల చేత పరీక్ష చేయించామని, సరిగాలేదని నివేదికలు వచ్చాయన్నారు. అందువల్ల రాత్రి సమయంలో గోడ కట్టాల్సి వచ్చిందన్నారు. బ్రిడ్జి మూసివేతకు ఎటువంటి ఆర్డర్స్ జారీ చేయనప్పటికీ అత్యవసర పరిస్థితుల్లో స్వయంగా తాను నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రాత్రి సమయంలో బ్రిడ్జి మూసివేతకు గోడలు కట్టడం, ఇందుకు నిధులు ఎక్కడి నుంచి వచ్చాయో అధికారులు సమాధానం చెప్పకపోవడం విమర్శలకు తావిస్తోంది.

శిక్షణ ఫలాలు విద్యార్థులకు చేరాలి


శిక్షణలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లను ఇస్తున్న వీసీ కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్: శిక్షణలో నేర్చుకున్న ఫలాలు విద్యార్థులకు చేరాలని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె. కృష్ణారెడ్డి అన్నారు. తమిళనాడు శ్రీపెరంబుదూర్లోని రాజీవ్ గాంధీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ డెవలప్‌మెంట్, వైవీయూ ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో 'యువత మానసిక ఆరోగ్యాన్ని ప్రోత్సహించడం పై' నిర్వహించిన మూడు రోజుల శిక్షణ ముగిసింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆచార్య కె. కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ద్వారా ఎక్కువ మందికి సమాచారాన్ని చేరవేయగలిగితే మంచి కుటుంబం, మంచి సమాజం తద్వారా దేశాభివృద్ధి జరుగుతుందని అభిప్రాయపడ్డారు. డాక్టర్ పి. కల్పన, సైకాలజీ శాఖ సహా ఆచార్యులు లలిత మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ వైవీయూ సమన్వయకర్త డాక్టర్ వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో శిక్షణ కొనసాగింది. అనంతరం శిక్షణలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

ఆకట్టుకున్న శకటాల ప్రదర్శన


వ్యవసాయశాఖ డ్రోన్ టెక్నాలజీ


ఎస్‌బీఐ శకటం


టూరిజం శాఖ


వైద్యశాఖ


అటవీశాఖ

కడప సెవెన్‌రోడ్స్ : గణతంత్ర దినోత్సవం సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ప్రగతి శకటాల ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ వేడుకలకు కడప పోలీసు పరేడ్ మైదానం వేదికైంది. సీపీఓ అండ్ పీడీ డీఆర్‌డీఏ, ఎల్‌డీఎం/చీఫ్ మేనేజర్, ఎస్‌బీఐ, పీడీ హౌసింగ్, పరిశ్రమల శాఖ, పర్యాటకం, విద్య, సమగ్ర శిక్ష, స్కిల్ డెవలప్‌మెంట్, మహిళా స్త్రీ శిశు సంక్షేమం, వైద్య ఆరోగ్యం, జలవనరులు, అటవీ, వ్యవసాయ, మత్స్య, పశుసంవర్ధక, పంచాయతీ, జెడ్పీ, ఆర్‌డబ్ల్యూఎస్, డ్వామా, విద్యుత్, ఉద్యాన, ఏపీఎంఐపీ, మున్సిపల్ కార్పొరేషన్, వజ్ర, అగ్నిమాపక శకటాల ప్రదర్శన ఆకట్టుకుంది. ఇందులో పంచాయతీరాజ్, డీపీఓ, జెడ్పీ, ఆర్‌డబ్ల్యూఎస్, డ్వామాల ప్రగతి శకటాలు మొదటి బహుమతి దక్కించుకున్నాయి. వ్యవసాయ, మత్స్య, పశు సంవర్ధక శాఖలకు రెండవ బహుమతి, మున్సిపల్ కార్పొరేషన్‌కు మూడవ బహుమతి లభించింది. సీపీఓ, డీఆర్‌డీఏ, హౌసింగ్, ఎల్‌డీఎం, ఎస్‌బీఐలకు ప్రోత్సాహక బహుమతులు వచ్చాయి.


సోలార్ ఎనర్జీ


పంచాయతీరాజ్‌శాఖ

సత్కారం


స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబ సభ్యులను సత్కరించి నమస్కరిస్తున్న కలెక్టర్ శ్రీధర్

స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబాలను కలెక్టర్ శ్రీధర్ సత్కరించారు. చెన్నూరు మండలానికి చెందిన పెడబల్లె బాల యలారెడ్డి కోడలు అరుణాదేవి, బుడ్డారెడ్డి శేషన్న కోడలు రమాదేవి, సీకే దిన్నె మండలం ఊటుకూరుకు చెందిన వేల్పుల సుబ్బయ్య సతీమణి వి.నారాయణమ్మ, పులివెందులకు చెందిన అశ్వర్థరెడ్డి కుమారుడు చంద్రశేఖర్‌రెడ్డి, ముసల్‌రెడ్డిపల్లెకు చెందిన సింగం శివారెడ్డి కుమారుడు జగన్‌మోహన్‌రెడ్డి, సింహాద్రిపురం మండలం ఎద్దులయ్యగారి కొత్తపల్లెకు చెందిన బాలిరెడ్డి కుమారుడు శివశంకర్ రెడ్డి, కడపకు చెందిన ఎల్.సంజీవరెడ్డి కుమార్తె ప్రభావతమ్మ, లింగాల మండలానికి చెందిన పిల్లా వెంకట్రామిరెడ్డి కోడలు కమలమ్మ, కడపకు చెందిన వల్లపు వెంకట సుబ్బయ్య కుమారుడు రఘురామమూర్తి, ఎర్రగుంట్ల మండలం చిలంకూరుకు చెందిన పక్కీరప్ప కుమారుడు శరత్‌బాబును సత్కరించారు.

ఉత్తమ సేవకు ప్రశంస


కలెక్టర్ శ్రీధర్ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న డీఆర్వో విశ్వేశ్వరయ్య

ఉత్తమ సేవలు అందించిన వారికి ప్రశంస లభించింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఇందుకు కడప పోలీస్ పరేడ్ మైదానం వేదికైంది. జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదివారం ప్రశంసా పత్రాలు అందించారు.
– కడప సెవెన్‌రోడ్స్


కమిషనర్ మనోజ్‌రెడ్డి | జాన్ ఇర్విన్, ఆర్డీఓ, కడప | బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్ | జెడ్పీ సీఈఓ ఓబులమ్మ | డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్ | వ్యవసాయాధికారి నాగేశ్వరరావు | జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి నాగరాజు | పులివెందుల ఆర్డీఓ చిన్నయ్య | శ్రీలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ | సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి | హ్యాండ్‌లూమ్ డీడీ పిచ్చేశ్వరరావు | సుబ్బారెడ్డి, వయోజన విద్యాశాఖ డీడీ


కృష్ణమూర్తి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఫ్యాక్టరీస్ | సురేష్‌కుమార్, జిల్లా ఉపాధి కల్పనాధికారి | అర్జున్‌రావు, సివిల్ సప్లయిస్ డీఎం | సాయిగ్రేస్, స్టెప్ సీఈఓ | ఇమ్రాన్, మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ | కృష్ణకిశోర్, దివ్యాంగుల శాఖ డీడీ | రాకేష్‌చంద్ర, అడిషనల్ కమిషనర్, కార్పొరేషన్ | మల్లికార్జున, మున్సిపల్ కమిషనర్, ప్రొద్దుటూరు | కె.విజయ్‌కుమార్, ఏఓ, కలెక్టరేట్ | ఎం.వెంకటస్వామి, సూపరింటెండెంట్, కలెక్టరేట్ | ఆర్.జీవన్‌చంద్రశేఖర్, సూపరింటెండెంట్, కలెక్టరేట్ | పి.భారతి, సూపరింటెండెంట్, కలెక్టరేట్


శరత్, కలెక్టర్ సీసీ | జనార్ధన్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ కలెక్టరేట్ | కె.పార్వతి, సీనియర్ అసిస్టెంట్, కలెక్టరేట్ | ఎం.స్మైలన్‌రాజ, స్పెషల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, కలెక్టరేట్ | రాజ్యలక్ష్మి, డీపీఓ | భరత్‌రెడ్డి, బీసీ వెల్ఫేర్ అధికారి, కడప | రమణారెడ్డి, వ్యవసాయాధికారి | రామకృష్ణారెడ్డి, మండల వ్యవసాయాధికారి | మాధవి, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ | మదన్‌మోహన్‌రెడ్డి, ఫారెస్టు రేంజ్ ఆఫీసర్, కడప | కె.శ్రావణి, డైప్యు, సమాచార పౌరసంబంధాలశాఖ | ఎం.అశోక్, స్వచ్ఛంద సేవకుడు | జి.భారతి, సీనియర్ అసిస్టెంట్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ | కె.జ్యోతి, ఏఓ, జిల్లా పోలీసు కార్యాలయం | ఎస్ఆర్ రాజేశ్వరి, సీఎస్ఆర్ఎంఓ, రిమ్స్ | రాఘవేంద్రప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్, రిమ్స్ | వి.లక్ష్మీనరసమ్మ, వైస్ ప్రిన్సిపాల్, రిమ్స్ మెడికల్ కాలేజీ


రాజేంద్రప్రసాద్, డీఎస్పీ | ఉలసయ్య, సీఐ | వెంకటేశ్వర్లు, డీఎస్పీ | అబ్దుల్ కరీం, డీఎస్పీ | నాగభూషణం, సీఐ | మధు మల్లేశ్వర్ రెడ్డి, సీఐ | సీతారామిరెడ్డి, సీఐ | శివశంకర్ నాయక్, సీఐ | లింగప్ప, సీఐ | హాసం, సీఐ | భాస్కర్‌రెడ్డి, సీఐ | వినయ్‌కుమార్‌రెడ్డి, సీఐ | కృష్ణారెడ్డి, సీఐ | హుసేన్, ఎస్ఐ | ఇబ్రాయిల్, హెడ్ కానిస్టేబుల్ | మహేష్, అల్ డిక్సన్ ఇన్‌చార్జి | జనార్ధనం, ఎల్‌డీఎం

ఆధిక్యంలో ఆంధ్రా జట్టు

రాణించిన బౌలర్లు


పోటీ పడుతున్న ఆంధ్రా, పంజాబ్ జట్టు


సాకేత్‌రామ్, ఆంధ్రా (4 వికెట్లు)


రాజు, ఆంధ్రా (4 వికెట్లు)

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న కల్నల్ సీకే నాయుడు అండర్–23 మల్టీడేస్ క్రికెట్ మ్యాచ్‌లో ఆంధ్రా బౌలర్లు రాణించారు. ఆదివారం బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ జట్టు 45.1 ఓవర్లలో 119 పరుగులకే ఆలౌట్ అయింది. జట్టులోని సలీల్ అరోరా 29, క్రిష్ భగత్ 21 పరుగులు చేశారు. ఆంధ్రా బౌలర్లు సాకేత్‌రామ్ 4, కె.ఎస్.రాజు 4 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్రా జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 27 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 85 పరుగులు చేసింది. జట్టులోని ఎస్.డి.ఎన్.వి. ప్రసాద్ 36, వెంకటరాహుల్ 21 పరుగులు చేశారు. పంజాబ్ బౌలర్లు ఆయుష గోయల్ 3, క్రిష్‌భగత్ 2 వికెట్లు తీశారు. దీంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్రా జట్టు 177 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

యూబీఓఏ క్రికెట్ టోర్నీలో జయకేతనం

కడప రూరల్ : యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏపీ యూబీఓఏ క్రికెట్ టోర్నమెంటును అనంతపురంలోని ఆర్డీటీ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహించారు. కామ్రేడ్ ఎన్‌వీఎస్‌ను స్మరించుకుంటూ నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో వైఎస్సార్ జిల్లాతోపాటు అనంతపురం కర్నూలు, తిరుపతి జిల్లా జట్లు పోటీపడ్డాయి. ఈ పోటీలో వైఎస్సార్ జిల్లా జట్టు మంచి ఉత్తమ ప్రతిభ కనబరిచి ట్రోఫీని కైవసం చేసుకుంది. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డును పి.భరద్వాజ్ గెలుపొందారు. కడప జట్టు కెప్టెన్ హర్షవర్ధన్‌రెడ్డితోపాటు టీం సభ్యులు కప్‌ను అందుకున్నారు. జట్టును విజయపథంలో నడిపించడంలో కోచ్ హర్షవర్ధన్‌రెడ్డి, అసిస్టెంట్ కోచ్ బి.ప్రదీప్ కీలకపాత్ర పోషించారు. ఈ విజయంతో జిల్లా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖల్లో ఆనందం వెల్లివెరిసింది.


ఏపీ యూబీఓఏ క్రికెట్ టోర్నమెంట్ ట్రోఫీతో జిల్లా జట్టు

మాజీ సైనికులకు వైవీయూ సత్కారం


మాజీ సైనికులతో వైవీయూ వీసీ, సిబ్బంది

కడప ఎడ్యుకేషన్ : భారత సాయుధ దళాల్లో సేవలు అందించి భారత రాష్ట్రపతి మెడల్స్ అందుకున్న సైనికులను, వివిధ దళాల్లో జరిగిన యుద్ధాల్లో కీలక భూమిక పోషించిన సైనికులను గుర్తించి యోగి వేమన విశ్వవిద్యాలయం గణతంత్ర వేడుకలకు ఆహ్వానించింది. ఈ మేరకు మాజీ కెప్టెన్ జానకి రామ్, మాజీ కెప్టెన్, ఎస్.ఎస్.రాముడు, మాజీ సుబేదార్ నాగరాజు, మాజీ ఎస్టీటీ ఎ.వెంకటేశు, మాజీ నాయక్ పి.కృష్ణయ్య, మాజీ సప్పర్ తిప్పిరిపాటి సైలస్, మాజీ హవల్దారు నాగన్న, మాజీ ఎస్టీటీ బి.వి.గోపాల్‌రెడ్డి, మాజీ నాయక్ పి.లక్ష్మినారాయణలకు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కృష్ణారెడ్డి, యూనివర్సిటీ రిజిస్ట్రార్, ప్రొఫెసర్ పి.పద్మ, యూనివర్సిటీ కాలేజ్ ప్రిన్సిపల్ ఎస్.రఘునాథరెడ్డి, ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్స్ శాఖ సంచాలకులు డాక్టర్ కె.రామసుబ్బారెడ్డి సెల్యూట్ చేసి సత్కరించారు. అనంతరం మాజీ సైనికుల సేవలను నిర్వాహకులు కీర్తించారు. వివిధ యుద్ధ సమయాల్లో పోషించిన పాత్రను మాజీ సైనికులు వెల్లడించారు. తల్లి ఒంటిమీద చిన్న గీత పడితే బిడ్డగా మనం ఎలా ఆక్రోశిస్తామో మన ధరిత్రి మీద ముష్కరుల నీడపడినా భారతదేశ సైనికులుగా, దేశ పౌరుడిగా కన్నెర్ర చేశామని వారు పేర్కొన్నారు. ఆ ఘటనల్లో శరీరంలో కొన్ని భాగాలు కోల్పోయామన్నారు. అయినా ఎనలేని తృప్తి పొందామన్నారు. త్రివిధ దళాలలోకి యువత రావాలని వారు ఆహ్వానించారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న బొలెరో

- ఇద్దరు దుర్మరణం
- మృతులు రాయచోటి వాసులు


మృతి చెందిన మహేంద్ర


ఫయాజ్ మృతదేహం

బి.కొత్తకోట : ఒకరు కూలీ పనులు చేసుకొంటూ.. మరొకరు డ్రైవర్‌గా, చికెన్ సెంటర్ నడుపుతూ జీవించే వారు. ఇద్దరూ కలిసి కోళ్ల కోసం వచ్చి తీసుకుని వెళ్తుండగా ప్రమాదానికి గురై దుర్మరణం చెందారు. ఈ సంఘటన శనివారం రాత్రి బి.కొత్తకోట మండలం కోటిరెడ్డిగారిపల్లి వద్ద జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటికి చెందిన ఎస్.ఫయాజ్ (30) స్థానికంగా చికెన్ సెంటర్ నడుపుతుండే వారు. డ్రైవర్‌గా కూడా పని చేస్తుంటారు. ఆయనకు భార్య షేక్ అమీనా, ఏడాదిన్నర వయసు కలిగిన కుమార్తె అర్ఫా ఉన్నారు. రాయచోటి సమీపంలోని శిబ్యాలకు చెందిన డి.మహేంద్ర (25) అవివాహితుడు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తండ్రి సహదేవ అనారోగ్యంతో మంచాన పడ్డాడు. తల్లి వెంకటలక్ష్మమ్మ గృహిణి. వారిద్దరూ శనివారం సాయంత్రం 5 గంటల తర్వాత పెద్దతిప్పసముద్రం మండలం రంగసముద్రం వద్ద ఉన్న కోళ్లఫారంలో కోళ్లు కొనుగోలు చేసి తీసుకెళ్లేందుకు బొలెరో వాహనంలో రాయచోటి నుంచి బయలుదేరారు. రంగసముద్రంలో కోళ్లను తీసుకుని రాత్రి రాయచోటికి వెళ్లేందుకు తిరుగు ప్రయాణం అయ్యారు. పెద్దపాళ్యం మీదుగా జాతీయ రహదారిపై అంగళ్లు వైపు వెళ్తున్నారు. అదే సమయంలో మండలంలోని కోటిరెడ్డిగారిపల్లి వద్ద తమిళనాడుకు చెందిన లారీని డ్రైవర్ రోడ్డుపక్కన నిలిపి ఉంచాడు. అంగళ్లు వైపు బొలెరో వాహనం నడుపుతూ వస్తున్న డ్రైవర్ ఫయాజ్ మలుపు వద్ద ఎదురుగా నిలిపి ఉన్న లారీని గుర్తించలేకపోయాడు. దీంతో నేరుగా లారీ వెనుక వైపు బొలెరో వాహనం ఢీకొంది. బొలెరో ధ్వంసమై అందులోని ఫయాజ్, మహేంద్రకు శరీరంపై పలుచోట్ల తీవ్ర గాయాలు అయ్యాయి. ఘటనా స్థలంలోనే ఇద్దరూ దుర్మరణం చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు రాత్రే ఘటనా స్థలికి చేరుకుని ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. మృతదేహాలను మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుల కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా ఒకే ఘటనలో ఇద్దరు మృతి చెందడంతో ఆ కుటుంబాల వారు తీవ్ర ఆవేదనతో విలపించారు.

చైన్ స్నాచింగ్

కలికిరి : పొలం వద్ద పనులు చేసుకుంటున్న వృద్ధురాలు మెడలో గుర్తుతెలియని వ్యక్తులు బంగారు గొలుసు లాక్కెళ్లిన ఘటన ఆదివారం కలికిరి మండలం పారపట్ల గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పారపట్ల గ్రామం కురవపల్లికి చెందిన కంభం భార్య ఆనందమ్మ పొలం పనులు చేసుకుంటుండగా ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చారు. వారిలో ఒక వ్యక్తి ఆమె వద్దకు వచ్చి కూరగాయలు కావాలని అంటూ మాటల్లో దింపి, మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లాడు. ద్విచక్రవాహనం వద్ద వున్న ఇద్దరు వ్యక్తులతో కలిసి సమీపంలోని గుండ్లూరు–వాల్మీకిపురం రోడ్డులో గుండ్లూరు వైపు వెళ్లారు. దీంతో వృద్ధురాలు పెద్దగా కేకలు వేసింది. సమీపంలోని గ్రామంలోకి వెళ్లి జరిగిన ఘటనను తెలియజేసి, బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మా బిడ్డలకు ఏదీ రక్షణ?

- మీ పిల్లలను వేరే వాళ్లతో ఇలాగే బయటికి పంపుతారా?
- ఎస్వోను ప్రశ్నించిన విద్యార్థినుల కన్నవాళ్లు
- కస్తూర్బా విద్యాలయంలో పని చేయని సీసీ కెమెరాలు
- ఆడిట్ బృందం తనిఖీలో విస్తుపోయే నిజాలు


సమావేశంలో ఎస్వో తీరుపై ప్రశ్నిస్తున్న పిల్లల కన్నవాళ్లు

పెద్దతిప్పసముద్రం : 'మా బిడ్డలకు ఏదీ రక్షణ?' అంటూ విద్యార్థినుల తల్లిదండ్రులు కస్తూర్బా విద్యాలయం బాధ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమగ్ర శిక్షా, పీఎం పోషణ్ సామాజిక తనిఖీ బృందం 2024 జూన్ నుంచి డిసెంబర్ వరకు సంబంధించి గత కొన్ని రోజులుగా ప్రభుత్వ, రెసిడెన్షియల్ స్కూళ్లను తనిఖీ చేస్తోంది. ఈ క్రమంలో ఎస్సార్పీ సుబ్బారావు, డీఆర్పీలు నాగిరెడ్డి, భగవాన్, మల్లేష్‌లు చేపట్టిన తనిఖీలో ఎన్నో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆదివారం స్థానిక కస్తూర్బా బాలికా విద్యాలయంలో ఆడిట్ బృందం పిల్లల కన్నవాళ్లతో గ్రామసభ నిర్వహించి వాస్తవాలు బహిర్గతం చేసింది. 'ఏడవ తరగతి చదివే బాలికను బయటి వ్యక్తుల వెంట పంపడంతో బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు, కన్నవాళ్ల అనుమతి లేకుండా మీ పిల్లలను వేరే వాళ్లతో ఇలాగే పంపుతారా, ఆచూకీ తెలిసింది కాబట్టి సరిపోయింది, మా బిడ్డలు ఏమైనా అయితే ఎవరు బాధ్యత వహిస్తారు' అని ఎస్వో శైలజాను విద్యార్థినుల తల్లిదండ్రులు ప్రశ్నించారు. ఎస్వోతోపాటు ఆమె కుటుంబ సభ్యుల దుస్తులన్నీ బాలికలే ఉతికి ఆరేస్తున్నారని, పిల్లలతో వేకువజామునే చపాతీల పిండి రుద్దిస్తున్నారని, వంట పనులకు వాడుకుంటున్నారని, పనులు చేయని వారిని పత్రికల్లో రాయలేని విధంగా అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని, కుల వివక్ష చూపుతున్నారని, ప్రత్యేక స్టోర్ రూం లేకపోవడంతో రాత్రి వేళ నిత్యావసర సరుకులు మాయం అవుతున్నాయని వారు వెల్లడించారు. భోజన విషయానికొస్తే అన్నంలో తల వెంట్రుకలు, పురుగుల అన్నం, నీళ్ల సాంబారు, పగలు మిగిలిన కూర రాత్రి పూట వడ్డించడం, గతంలో వండిన రసంలో బల్లి పడటం, మెనూ పాటించక పోవడం తదితరాలతో బాలికలు అర్ధాకలితో చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక మౌలిక సౌకర్యాల గురించి ఆరా తీస్తే.. 231 మంది బాలికలు ఉన్న ఈ స్కూల్‌కు సీసీ కెమెరాలు ఉన్నా పని చేయవు, పూర్తిస్థాయిలో ఫ్యాన్లు తిరగవు, మినరల్ ఆర్వోవాటర్ ప్లాంట్ ఉన్నా అది అలంకారమే, తద్వారా బోరు నీళ్లే దిక్కు, మరుగుదొడ్లకు తలుపులు ఉన్నా గడియలు లేవని వాపోయారు. నిబంధనల విషయానికొస్తే.. ఎస్వో భర్త ఎప్పుడుపడితే అప్పుడు స్కూల్‌లోకి వచ్చి పుష్టిగా భోజనం ఆరగించి అక్కడే ఉండటం, అస్తవ్యస్తంగా రిజిస్టర్ల నిర్వహణ, పేరెంట్స్ కమిటీ మీటింగ్ సక్రమంగా నిర్వహించకపోవడం, వాడేసిన న్యాప్‌కిన్స్ మిషన్‌లో బర్నింగ్ చేయాల్సి ఉన్నా యంత్రాన్ని వాడకుండా బయట పడేయడం, స్కూల్‌కు రాని పిల్లలు కూడా హాజరైనట్లు రిజిస్టర్‌లో నమోదు, పిల్లల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపకపోవడం వంటి వాటితో తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు వివరించారు. ఈ వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆడిట్ బృందం పేర్కొంది.